''వచ్చే వారం శ్రీశైలం వెళ్దాం, రెడీనా'', అడిగాడు సురేష్.

''నువ్వడిగితే ఎప్పుడు రెడీనే. ఇంతకు ఏంటి విశేషం'', అన్నాడు బాబు.

''ఏం లేదు. కొత్తగా మారుతీకారు కొన్నాను. శ్రీశైలం వెళ్తే కాస్త సరదాగా గడపవచ్చు. బండి ఎలా ఉందో చూడచ్చు'', అన్నాడు సురేష్.

''ఎన్నో తారీఖు?''

''రేపు చెప్తాలే'', ''మంచి రోజు కనుక్కొని'', అని మనస్సులో అనుకొన్నాడేగాని బయటికి అనలే.

''మంచి రోజు'' అంటే మండి పడి పోతాడు బాబు.

సురేష్, బాబు ఇద్దరూ సంపన్నుల బిడ్డలు. ఎం.ఎ. దాకా కలిసి చదువుకొన్నారు. సురేష్ తండ్రి ఇచ్చిన బియ్యం మిల్లు నడుపుతుంటే, బాబు

# జాగ్తే రహో!

## —మాధవ్

కాంట్రాక్టు పనులు చేస్తాడు తండ్రి లాగానే.

బాబును గోరాగారి శిష్యుడు అనటానికి వీల్లేదుగాని, అభ్యుదయ భావాలున్న వాడనవచ్చు. మూఢాచారాలంటే ఎంతో ఏవగింపు చూపిస్తాడు.

సురేష్‌కు దేవుడి మీదనే కాకుండా, స్వాములన్నా, బాబాలన్నా, ఆధ్యాత్మిక చింతలున్నవారన్నా ఎంతో భక్తి.

ఇద్దరూ ఈ మధ్యనే ''మంచి రోజులను'' గురించి వాగ్వివాదం వేసికొన్నారు.

''మంచిరోజు పేరుతో ప్రయాణాలు వాయిదా వేసి కోవటం మూర్ఖత్వం తప్ప మరేమికాదు'', అన్నాడు బాబు.

బాబు దేన్ని గురించి మాట్లాడినా వినటానికి ఇంపుగా ఉంటుంది. అందుకని సురేష్ చెవులప్పగించి ఊరుకొన్నాడు. బాబు చెప్పకొంటూ పోతున్నాడు.

''మద్రాసులో రోజూ ముప్ఫయి లక్షల మంది ప్రభుత్వ సిటీబస్సుల్లో ప్రయాణం చేస్తారు. మద్రాసు సెంట్రల్ స్టేషన్లో రోజూ 30 వేల మంది టిక్కెట్లను ముందుగా బుక్ చేసికొంటారు. అమెరికాలో రోజూ 78 వేల విమాన ప్రయాణాలుంటాయట. వీళ్ళంతా వారం, తిథి, నక్షత్రం, రాహుకాలం, వర్జ్యం చూసి ప్రయాణాలు చేస్తున్నారా? ఎంతమంది ప్రమాదాలకు గురవుతున్నారు? ప్రమాదాలు ''చెడ్డ'' రోజుల్లోనే జరుగుతున్నయ్యా?

''మంచి రోజు చూసి పెళ్ళి చేస్తామే! నిరుడు మన రాష్ట్రంలో భార్యా-భర్తల తగాదాల వల్ల 163 మంది- 62 మంది భర్తలు, 101 మంది భార్యలు- ఆత్మహత్య చేసుకున్నారని పోలీసు వారే చెపుతున్నారు. కట్నం తేలేదని ఎంతమంది కొత్త పెళ్ళికూతుళ్ళు అగ్నికి ఆహుతి చేయబడుతున్నారో! లగ్నం మంచిదయినా, వారందరికి చెడు తప్పటం లేదే!

''లగ్నాలంటే గుర్తువచ్చింది. రాశిఫలాలు చూసుకొని జీవనం చెయ్యడం కుదురుతుందా? ప్రపంచ జనాభా 484 కోట్లుట ఇప్పుడు. అందరూ పన్నెండు రాసుల్లో ఏదో ఒకదాంట్లో పుట్టి ఉండాలి గదా. అంటే నువ్వు చదివే రాశి ఫలం సుమారు 40 కోట్ల మందికి సరిపోవాలన్నమాట. రాశి ఫలం చూసి, మంచి రోజు చూసి పనులు చేయడం కన్నా, కుక్కతోక పట్టుకుని గోదావరి ఈదటం సులభం.''

సురేష్ ఒక నిమిషం సేపు మాట్లాడలేదు. '' చూడు బాబు, నీ నమ్మకాలు నీవి; నా నమ్మకాలు నావి. మంచి రోజు పాటిస్తే వచ్చే నష్టం లేదని నా నమ్మకం. మునిగిపొయ్యే పనులొస్తే, మంచి రోజు చూసే వ్యవధి లేకపోతే ఆ పనులు ఆపటం లేదే! వీలున్న పరిధిలో మంచి రోజు చూడటం మంచిదని నా అభిప్రాయం.

వివాదం తెగేది కాదు కనుక అంతటితో ముగించారు ఆ రోజు.

సురేష్, బాబు శ్రీశైలం బయలుదేరారు. సురేష్ మంచిరోజు చూశాడని చెప్పనక్కర్లేదు.

కారు ఎలా ఉందో చూడాలంటే శ్రీశైలం దాకా వెళ్ళనక్కరలేదు. సురేష్ ఉద్దేశ్యం మరొకటి ఉంది. అక్కడ ఘాట్ రోడ్డు ప్రక్కగా కొంచెం దూరం అడవిలోకి వెళ్తే అక్కడ కొత్తగా వెలిసిన ఆశ్రమాన్ని చూడచ్చు. స్వామి జ్ఞానానందట. ఆశ్రమం పెట్టి ఓ ఏడాదయిందిట. భక్తులు ఎంతో మంది ఆయన దగ్గరకు వెళ్ళి ఎంతో లాభం పొందుతున్నారుట.

''ఏ పుట్టలో ఏ పాముందో. అక్కడికి వెళ్ళాలి'', అనుకొన్నాడు సురేష్. మారుతికారు వచ్చిన వంకతో శ్రీశైలం యాత్ర పెట్టాడు. స్వామి దర్శనం కూడా ఉందని చెప్తే బాబు ఏ మంటాడో అని ఆ సంగతి చెప్పలేదు.


శ్రీశైలంలో ప్రాజెక్టు గెస్టు హౌసులో రెండు రాత్రులు తీసికొని వెళ్ళిన స్కాచ్ విస్కీతో సరదాగా గడిపారు. దేవాలయానికి వెళ్ళి దైవదర్శనం చేసుకొన్నారు.

తిరిగి వచ్చేటపుడు మాత్రమే కారును ఆశ్రమం వైపుకి తిప్పి, సంగతి చెప్పాడు సురేష్. బాబు ''సరే పోనీ'' అన్నాడు.

ఓ ఎత్తైన కొండమీద ఓ చిన్న పర్ణకుటీరం. ప్రక్కనే పెద్ద లోయ. వాతావరణం ఎంతో ప్రశాంతంగా ఉంది. ప్రకృతిరామణీయకతను చూసి ఎంతో తన్మయత్వం చెందాడు బాబు.

ఈ జ్ఞానానంద స్వామి ఎవరు? పూర్వాశ్రమంలో ఈయన ఏమి చేసేవారు? ఏ ఊరు? ఇక్కడికి ఎందుకు వచ్చారు?

...







# మామూలు ఫస్టు క్లాసును తలదన్నే క్లాసు మా మహారాజా క్లాసు

అవును. మానుంచి మీకు లభించే మహారాజ సత్కారాలలో ఇది ఒక్కటి మాత్రమే. అయితే మా సత్కారాలలో మరెన్నో సౌకర్యాలు కూడా ఉన్నాయి.

- మా 747 విమానాలు A 310 విమానాలన్నిటిలోనూ ప్రతి సీటూ సవిలాసమైన స్లంబరెట్ సీటే.
- యూరోపీయ వంటకాలేకాక నాజూకైన భారతీయ మసాలా వంటకాలనుంచి కూడా ఎంచుకునే వీలు. పైగా సొగసైన పింగాణీ పాత్రలలోనూ, వెండిపాత్రలలోనూ కళాత్మకంగా వడ్డన.
- అత్యుత్తమమైన వైన్లు, మద్యాల నుంచి మీరు కోరినవి.
- సాంప్రదాయికమైన వేషభూషలు ధరించిన విమానసేవికల ద్వారా మీకు పరిచర్యలు, మీకు మత్తెక్కించే భారతీయ అతిథి సత్కారాలు.
- మహారాజ భవనాన్ని స్మరణకు తెచ్చే అలంకార శోభలు.
- చాలా ఏర్‌పోర్టులలో మహారాజా లాంజ్‌లు.
- వేరుగా ప్రత్యేకమైన చెక్-ఇన్ సౌకర్యాలు.

అందుకే చెప్తున్నాం. రండి. వేరే ఎక్కడో విసుగుతో ఆవలిస్తూ కూర్చునే బదులు మా మహారాజా క్లాసులో ప్రయాణించండి, మా స్లంబరెట్ సీటుపైన హాయిగా కాళ్లు జాపుకుని విశ్రాంతి తీసుకోండి. అసలైన మహారాజ భోగమనుభవించండి.


**ఎయిర్-ఇండియా**

**AIR-INDIA**

మీకు మహారాజ మర్యాదలనందించే విమాన సంస్థ.

HTA 2789


ఈ ప్రశ్నలకు సమాధానాలు సురేష్ దగ్గరా లేవు; అక్కడికి అప్పుడే వచ్చి ఉన్న భక్తుల దగ్గరా లేవు.

స్వామి ఇచ్చే తీర్థప్రసాదాలను తీసికొని, తమ సమస్యలను చెప్పుకొని, సమాధానాల కోసం ఎదురు చూడటమే భక్తులపని.

జ్ఞానానందస్వామి పూజ పూర్తిచేసి కుటీరం లోంచి బయటికి వచ్చారు. భక్తులు ఒక్కొక్కరే వెళ్ళి ఆయనను కలుసుకుని వస్తున్నారు.

స్వామి వారి ముఖంలో ఉన్న ప్రశాంతత బాబును ఆకర్షించింది. ప్రపంచానికి దూరంగా, ఈ అరణ్య ప్రాంతంలో, చీకూ, చింతా లేకుండా స్వామి ఎలా ఉండగల్గుతున్నారు?

అడగాలని ఉన్నా అడగడం ఔచిత్యం కాదని ఊరుకొన్నాడు. సురేష్, బాబులను గురించి సౌమ్యంగా కుశలప్రశ్నలు వేసి, స్వామి అన్నారు, ''మీకు తులసి తీర్థం తప్ప నేనేమీ ఇవ్వలేను. ఆశ్రమం అభివృద్ధి అయింతర్వాత భక్తులకు కాస్త వసతి, తిండి ఏర్పాటు చేస్తాను?''

స్వామి మహిమలేమీ చేసి చూపెట్టలేదు. ఆయన చూపిస్తారని కూడా ఎవరూ చెప్పలే. అందుకే బాబుకు సంతోషం వేసింది. దేవునికి తన జీవితాన్ని అంకితం చేసుకొన్న వ్యక్తిని కల్సుకొన్నాననీ.

''స్వామి! నేను చేయబొయ్యే కొత్త వ్యాపారం ఫలిస్తుందా,'' బాబు అడిగాడు.

''మానవ ప్రయత్నం చెయ్యిబాబు; మిగిలినవి ఆ దేవుడికి వదిలెయ్యి,'' అని ప్రక్కన ఉన్న పెట్టెలోంచి ఓ చిన్న రాగి రేకు తీసి ఇచ్చారు స్వామి. ''ఈ రేకును భద్రంగా ఉంచుకో. కష్టం వస్తే నన్ను గుర్తుతెచ్చుకో.''

సురేష్‌కు ఏమడగాలో తోచలేదు. అయినా ఊరుకో బుద్ధి కాలేదు. ''స్వామీ! నా వ్యాపారంలో లాభాలు ఇలానే ఉంటయ్యా''.

''జీవితంలో కష్టాలు తప్పవు. ధైర్యంగా ఎదుర్కో.'' సురేష్‌కు ఏదో చివుక్కుమన్నది. శుభం ఏదన్నా చెప్తాడనుకొనివస్తే, కష్టాలంటా డేమిటిరా బాబు అనుకొన్నాడు. తనకు రాగి రేకు ఇవ్వలేదు; చివరికి విభూతి కూడా లేదు.

స్వామికి నమస్కారం పెట్టి. ఇంటికి బయలుదేరారు. మారుతి ఘాట్ రోడ్డు మలుపులు తిరుగుతుంటే స్వామిని గురించే ఇద్దరూ మాట్లాడుకొంటున్నారు.

అందరు స్వాములు, బాబాలు ఇలా ఉంటే గొడవేముంది అన్నాడు బాబు. స్వామి నిరాడంబరత బాబును ఆకర్షించింది. ఆయన చెప్పిన విషయాలు ఆయ నంత సింపుల్‌గా ఉన్నయ్యే. 'మానవ ప్రయత్నం చేయి... కష్టాలను ధైర్యంగా ఎదుర్కో'. తెలీని సంగతులు కావు. కాని వారి నిస్వార్థ చింతన, ఫలాపేక్ష లేకుండా భక్తుల కష్టాలను విని, తనకు తోచించి చెప్పటం విశేషంగా కన్పించింది బాబుకు.

''నాకేం నచ్చలే. అంతా మెట్ట వేదాంతం,'' అన్నాడు సురేష్.

''ఇంతకూ నువ్వు మొదలుపెట్టబోయే వ్యాపారం ఏంటో నాతో చెప్పావు కాదు'' అన్నాడు సురేష్.

''బార్. కాంట్రాక్టులు నాన్నగారు చూస్తున్నారు కదా. ఇద్దరికి అందులో పని లేదు. అందుకని బారు తెరుద్దామనుకొంటున్నాను,'' అన్నాడు బాబు. ''నేను కూడా బియ్యం మిల్లు అద్దెకొకటి తీసుకొందామనుకొంటున్నాను. కొంచెం టైము పట్టేట్టుంది,'' అన్నాడు సురేష్.

మారుతి మలుపు తిరుగుతూనే ఉంది. వెనుకనుంచి దూకుడుగా వచ్చిన లారీ మారుతిని గుద్దింది. ''స్వామీ! రక్షించు'' అని బాబు పెద్దగా అరిచాడు. స్టీరింగు పట్టు తప్పింది సురేష్‌కు. బండి వెళ్ళి ఘాటు రోడ్డు గోడకు గుద్దుకుంది.

సురేష్, బాబు బ్రతికిబయటపడ్డారు. బండి మాత్రం నాశనమయింది. చిన్న దెబ్బల్లోంచి వచ్చే రక్తాన్ని చేతి గుడ్డలతో తుడుచుకొని, ఏం జరిగిందా అని చూసుకునే లోపల వెనుకనుంచి గుద్దిన లారి, తుర్రుమని ప్రక్కగా వెళ్ళి పోయింది.

సురేష్‌కు ఏడుపే తక్కువ. కళ్ళ వెంబడి నీళ్ళు రాలాయి. తొంభై వేలు పోసి, బ్లాకులో కొన్న మారుతి కొండ క్రిందకు త్రోసివేస్తే మంచిదేమో అనేట్టుగా తయారయింది. సురేష్ బాబు వైపు తిరిగి తీక్షణంగా మాట్లాడటం మొదలు పెట్టాడు.

"అసలు దేవుడనే వాడున్నాడా?"

"ఉంటే ఇలా ఎందుకు జరగాలి?"

"మారుతికారు కొన్నానని ఆంజనేయస్వామికి అర్చన చేయించానా?"

"మొదటగా పుణ్యక్షేత్రానికే యాత్రగా వచ్చానా?"

"స్వామి ఉన్నాడంటే, వెళ్ళి కలిశానా?"

సురేష్ మాటలు బాబును ఆశ్చర్యపర్చినాయి." చూడు సురేష్. కష్టాలు వస్తాయి, పోతాయి. ధైర్యంగా ఉండాలి," అన్నాడు.

"ఆ దొంగ ముండాకొడుకు మాటలు నాకు అప్పచెప్పకు. ప్రమాదానికి కారణం వాడే. శుభమా అని వాడి దగ్గరికి వెళ్తే కష్టాలు, నష్టాలని కూస్తాడా? వాడికి అసలు శ్రీశైలంలో ఏం పని. వాడి గుట్టు లాగుతా చూడు."

"అయినా, వాడి నంటే ఏం ప్రయోజనం.

దేవుడు మన ఊళ్ళోలేడా!

మారుతిని పరీక్ష చెయ్యటానికి ఇంతదూరం రావాలా? స్కాచ్ తాగటానికి ఊళ్ళో బార్‌లు లేవా?"


కారువదిలేసి, బస్సు పట్టుకొని ప్రక్క ఊరుకు వెళ్ళి పోలీసు రిపోర్టు ఇచ్చి, ఊరుకు తిరిగి చేరారు.

నెల రోజుల్లోనే బాబు బార్ తెరిచాడు. మూడు పువ్వులు- ఆరుకాయలు- కాదు, మూడు గ్లాసులు ఆరు నిప్‌లు(NIPS) లాగా బార్ వృద్ధిచెందింది. బారులుతీరిన జనం. పగలనక, రాత్రనక ఒకటే జనం.

స్వామి ఇచ్చిన రాగి రేకును బాబు గల్లా పెట్టెలో భద్రపరిచి రోజూ ఒకసారి నమస్కారం పెట్టున్నాడు.

బార్‌తో నూరు రోజుల పండుగ కూడా

జరిపాడు. ఆర్నెల్లు కాగానే స్వామి






# ఒక సిపిసి పంపు సెట్టును కొనుక్కొని వుండవచ్చునే అని మీరు యోచించవలసిన సందర్భం యిది.

మీకు సిపిసి ప్రీమియర్ డొమెస్టిక్ పంపు సెట్టుపై 2 సంవత్సరాల గ్యారంటీ కలదు. కారణం, యీ రంగంలో 40 సంవత్సరాల అద్వితీయమైన అనుభవమును అండగా కలిగివున్న బలిష్ఠమైన సిపిసి ప్రీమియర్ మోటారు అమర్చబడిన ఒకే ఒక పంపు సెట్టుయిది.

**2 సంవత్సరాల గ్యారంటీ**

పైగా, దీని అనన్యమైన అమ్మక స్థావరములు విస్తారముగా వ్యాపించి, మీకు అందుబాటులో వున్నందువల్ల, అమ్మకం తర్వాత విశ్వసనీయమైన సర్వీసును వెను వెంటనే సమకూర్చగలదు.



**సిపిసి ప్రీమియర్**

గృహోపయోగ పంపు సెట్లు

**సిపిసి (పి) లిట్**

9861 TG/AJ


శాఖలు :- 17-2-30 పొన్నియమ్మన్ కోయిల్ స్ట్రీట్, చిత్తూరు-1 ఫోను : 3228 ● 5-2-130-131, రాష్ట్రపతి రోడ్డు, సికిందరాబాదు- 500 003, ఫోను : 824074 ● 66/67, సిల్వర్ జూబిలీ పార్క్ రోడ్డు, బెంగళూరు- 560 002.


దగ్గరికి వెళ్ళాడు. ఈ సారి ఒంటరిగానే. "స్వామీ మీ ఆశీర్వాదం వల్ల నా వ్యాపారం ఎంతో బాగుంది. నాకు వచ్చిన లాభంలో పది శాతంతో, ప్రజల విరాళాలతో మీ ఆశ్రమంలో భక్తుల సౌకర్యం కోసం ఒక బిల్డింగు కట్టిద్దామను కొంటున్నాను," అని చెప్పాడు.

"నాకు పర్ణశాల చాలు; భక్తులకు మంచి బిల్డింగు ఉంటే మంచిదే. అలానే కానివ్వు బాబూ" అన్నారు.

సురేష్ కష్టాలు మారుతి ప్రమాదంతో పోలేదు. మారుతి కార్లు అమ్మినవారి, కొన్నవారి గోత్రాలు ఇన్‌కమ్‌టాక్సువారు లాగారు. దాంట్లో భాగంగానే బియ్యం మిల్లు మీద దాడి జరిగింది. ఆదాయపు పన్ను ఎగ్గొట్టారని ఇన్‌కమ్ టాక్సువారు కేసు పెట్టారు. దొంగ పర్మిట్లతో మద్రాసుకు బియ్యం ఎగుమతి చేస్తున్నారని రాష్ట్ర విజిలెన్సు వారు కేసు పెట్టారు. కేసుల గురించి పేపర్లల్లో రాకుండా చూసుకోవటానికి, వాటి నుంచి "మామూలు" మార్గాల ద్వారా బయటపడటానికి సురేష్, వాళ్ళ నాన్న పడని ఇబ్బంది, ఖర్చు లేదు. ఊపిరి పీల్చుకోవడానికి ఆర్నెల్లు పట్టింది.

బాబు శ్రీశైలం ఆశ్రమంలో విశ్రాంతి గృహం నిర్మాణానికి ప్రజల దగ్గరికి విరాళాలకు బయలుదేరాడు. స్వాముల, బాబాల బండారం బయటపెట్టటానికి




సభలు ఏర్పాటు, సభల ఖర్చుకు విరాళాలు పోగుచెయ్యటం మొదలుపెట్టాడు సురేష్.

ఊళ్లో పరంధామయ్య గారింటికి ఇద్దరు ఒకరి తర్వాత ఒకరు వెళ్ళారు. ఇద్దరికి వెరి ఐదు వందల రూపాయిల చొప్పున "దానశీలి" విరాళం ఇచ్చారు. గుమాస్తా, చెక్కులు ఇచ్చిం తర్వాత, ఆశ్చర్యంగా పరంధామయ్యగారి వైపు చూశాడు.

పరంధామయ్యగారు చిరునవ్వునవ్వారు. "ఆస్తికునికి, నాస్తికునికి తేడా ఏ అక్షరంలో ఉంది?" అని అడిగాడు.

ఓసి, ఇది ఓ ప్రశ్నేనా అని "నా" అన్నాడు గుమాస్తా. చెప్పారు పరంధామయ్య గారు, "నా" విషయంలో అందరూ ఒకటే. అందరూ కావాలి. ఎలక్షన్లలో నాస్తికులకి, ఆస్తికులకి ఓట్లు ఉంటయ్యోయి దద్దమ్మా." పరంధామయ్యగారు ఎన్నిక కావాల్సిన వ్యక్తే అనుకొన్నాడు గుమాస్తా. నేటి నాస్తికులే రేపటి ఆస్తికులు. నేటి ఆస్తికులే రేపటి నాస్తికులు. అస్తి-నాస్తి, నాస్తి-అస్తి. బుర్ర తిరిగిపోతుంది గుమాస్తాకు.

"కొన్ని సంగతులు నీకు తెలీవుగాని, నీ లెక్కలు నువ్వు రాసుకో," పరంధామయ్యగారు సలహా ఇచ్చారు.

